కందకాల వాళ్ళగాథ:

పూర్వకాలంలో ఒక రాజు వద్ద ఒక మాంత్రికుడు ఉండేవాడు. ఆ మాంత్రికుడు వృద్ధుడైపోయాడు. తనకు తెలివితేటలున్న ఒక బాలుణ్ణి ఇస్తే, తానతనికి మంత్ర తంత్రాల విద్యను నేర్పుతానని రాజుతో చెప్పాడు. రాజుగారు ఆ ముసలివాడి అభ్యర్థనపై మంచి తెలివితేటలు గల ఒక బాలుణ్ణి ఈ పని కోసం అంకితం చేశాడు. ఆ బాలుడు ప్రతిరోజూ తాంత్రిక విద్యను నేర్చుకోవటానికి ఆ వృద్ధుని ఆశ్రమానికి వెళ్ళేవాడు. మార్గమధ్యంలో ఒక మతాచార్యుని కుటీరం ఉండేది. ఆ అబ్బాయి వస్తూపోతూ కాస్సేపు ఆ కుటీరం వద్ద కూడా కూర్చుని ఆ మతాచార్యుని ఉపదేశాలను కూడా ఆలకించేవాడు. మతాచార్యుని మాటలు ఆ అబ్బాయిని ఆకట్టుకున్నాయి. రోజులు గడుస్తున్నాయి.

ఒక రోజు ఆ పసివాడు వెళుతుండగా దారిలో ఒక మృగం బైఠాయించి ఉంది. దాని వల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. అదే సమయంలో ఆ పసివాడికి ఒక ఆలోచన తట్టింది. మతాచార్యుడు చెప్పేది నిజమా? మాంత్రికుని విద్య నిజమా? అతను ఒక రాయి చేతిలో తీసుకుని, "ఓ అల్లాహ్! నీ దృష్టిలో ఈ మతాచార్యుని విధానం మాంత్రికుని పోకడకన్నా వాంఛనీయమైనదైతే ఈ రాయి ద్వారా నీవు ఈ క్రూరమృగాన్ని చంపివేయి!" అని సంకల్పించుకుని రాయి విసిరాడు. అలా చెప్పి రాయి రువ్వగానే ఆ మృగం కాస్తా చచ్చిఊరుకుంది. ప్రజల ఇబ్బంది తొలగిపోయింది. ఆ అబ్బాయి ఆ రోజు జరిగిన సంఘటననంతటినీ మతాచార్యునికి వివరించాడు. మతాచార్యుడు ఆశ్చర్యపోయాడు. తరువాత ఇలా అన్నాడు : "చంటీ! నువ్విప్పుడు పరిపక్వతను సంతరించుకుంటున్నావ్‌రా! ఇకనుంచి నీకు అడుగడుగునా పరీక్షలు కూడా ఎదురవుతాయి. కాని ఎవరయినా నిన్ను నిలదీసి అడిగినప్పుడు నా పేరు చెప్పకు."

ఈ అబ్బాయి గుడ్డి వాళ్లను, కుష్టురోగులను, ఇతర వ్యాధిగ్రస్తులను నయం చేసేవాడు. అయితే తన దగ్గరకు వచ్చిన రోగులందరినీ నిజప్రభువు అయిన అల్లాహ్‌ను విశ్వసించాలన్న షరతు మీదనే చికిత్స చేసేవాడు. ఈ షరతుపైనే అతను రాజుగారి దర్బారులో అంధుడుగా ఉన్న ఒక సలహాదారునికి కంటిచూపును ఇచ్చాడు. తన

దగ్గరకు ఏ రోగివచ్చినా "ఓ అల్లాహ్! నీవు ఇతని జబ్బును (లేక లోపాన్ని) దూరం చేయి!" అని ప్రార్థించేవాడు. అతని వేడుకోలు దైవసన్నిధిలో స్వీకరించబడేది. ఎంతోమంది రోగులకు ఆరోగ్యం చేకూరింది. వారంతా ఆ బాలుడు నమ్మే ప్రభువును నమ్మి నడుచుకోవటం మొదలెట్టారు. ఆ విధంగా ఆ అబ్బాయి పేరు మార్మోగి పోసాగింది. రాజుగారి చాప క్రిందికి నీళ్లు వచ్చేశాయి. తన రాజరిక వ్యవస్థకు ముప్పువాటిల్లే ప్రమాదాన్ని పసిగట్టిన ఆ నిరంకుశ రాజు ఎంతోమంది విశ్వాసులను హతమార్చాడు. చివరికి ఆ అబ్బాయిని కూడా బంధించి, అతన్ని వధించటానికి ఒక ప్రత్యేక దళాన్ని నియమించాడు. అతన్ని ఒక పెద్ద పర్వత శిఖరం మీదికి తీసుకుపోయి, అక్కణ్ణుంచి క్రిందికి తోసెయ్యండని తన భటులకు ఆదేశించాడు. పర్వతం మీదికి పోతుండగా ఆ పసివాడు తన నిజప్రభువును ప్రార్థించాడు. అంతే! ఆ పర్వతం ప్రకంపించసాగింది. రాజభటులంతా కుప్పకూలిపోయారు. ఆ అబ్బాయి మాత్రం సురక్షితంగా ఆ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. రాజు గారికి మతి పోయినంత పనయింది. తుదకు అతన్ని పడవ మీద తీసుకుపోయి, సముద్రంలో పడవెయ్యమని ఆజ్ఞాపించాడు. కాని అక్కడా రాజుగారికి శృంగభంగమే అయింది. ఆ అబ్బాయి ప్రార్థన చేయగానే పడవ మునిగిపోయింది. అందరూ సముద్రంలో మునిగి చచ్చిపోయారు. ఆ అబ్బాయి మాత్రం ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. రాజు నివ్వెరపోయాడు. అప్పుడు ఆ బాలుడు స్వయంగా సలహాయిస్తూ, "నన్ను చంపాలన్నదే నీ ధ్యేయమైతే ఒక బహిరంగ ప్రదేశంలో జనులను సమావేశపరచు. 'ఈ అబ్బాయి విశ్వసిస్తున్న ప్రభువు నామంతో' అని బిగ్గరగా పలికి నా మీద బాణాన్ని సంధించు" అన్నాడు. రాజు అలాగే చేశాడు. మరుక్షణమే బాణం గుచ్చుకుని ఆ పసివాడు మరణించాడు. మేము కూడా ఈ అబ్బాయి విశ్వసించే ప్రభువునే విశ్వసిస్తున్నాం అని ప్రజలు ఎలుగెత్తి చాటారు. రాజు మరింతగా ఆందోళన చెందాడు. అప్పుడతను పెద్ద పెద్ద కందకాలను త్రవ్వించి, అగ్నిని మండించాడు. తన మాట వినకుండా నిజ దైవాన్ని నమ్మే వారందరినీ అగ్నికి ఆహుతి చేయమని ఆజ్ఞాపించాడు. ఆ విధంగా విశ్వాసులు వరుసగా కందకాలలో త్రోసివేయబడ్డారు. ఆఖరికి ఒక స్త్రీ

చంటి పిల్లవాణ్ణి ఎత్తుకుని వచ్చింది. ఆమెలోని మమకారం ఉప్పొంగగా, కందకంలో దూకటానికి తటపటాయించింది. అప్పుడు మాటలు కూడా రాని ఆ చంటిపిల్లవాడు, "అమ్మా! సందేహపడకు. నువ్వు సత్యంపై ఉన్నావు" అన్నాడు (సహీహ్ ముస్లిం – కందకాల వాళ్ళ వృత్తాంతం – టూకీగా). ఇమామ్ ఇబ్నె కసీర్ మరికొన్ని సంఘటనలను కూడా నకలు చేశారు. అవి కొంత భిన్నంగా ఉన్నాయి. బహుశా ఇలాంటి దురంతాలు ఎన్నో పలుచోట్ల పలు విధాలుగా జరిగి ఉండవచ్చు. (వివరాల కోసం తఫ్సీర్ ఇబ్నె కసీర్ చూడండి).

Source: అంతిమ దైవగ్రంథం ఖుర్ఆన్ (అనువాదం, వ్యాఖ్యానం) – అహ్సనుల్ బయాన్ – Surah Al Burooj

http://TeluguIslam.net